# బూచి

— సహృదయ




గోవిందకు ఆందోళనగా వుంది. అప్పుడే మధ్యాహ్నం మూడున్నర కావస్తోంది. అటు చూస్తే విశాఖపట్నం నుండి గోదావరి ఎక్స్‌ప్రెస్ ఠంచనుగా నాలుగ్గంటలకే బయల్దేరిపోతుంది. ఇటు చూస్తే ఈ పలాస పాసెంజరింకా కొత్తవలసే చేరలేదు.

గోవిందకు హైదరాబాద్ పనిపడింది. పది రోజుల ముందుగానే విజయనగరం కోటాలో ఆ రోజు గోదావరికి రిజర్వేషను చేసేసుకున్నాడు. విజయనగరం నుండే ఛార్జి చేస్తారేమో వేరే బస్సుమీద విశాఖపట్నం వెళ్ళడం దండుగ. అయితే గోదావరికి సరియైన కనెక్షను ట్రైను విజయనగరం నుండి లేదు. ఉదయం ఆరు గంటలకి షటిల్ మరీ ముందుగా వెళ్ళిపోవలసి వుంటుంది. పది గంటలకు రాయపూర్ పాసింజర్. దైవాధీనం రావడం. పన్నెండున్నరకే పలాస పాసింజరు. ఎప్పుడూ లేటే. ఈ మధ్యకాలంలో పదకొండుకు మెయిలుంది. ఈ టిక్కెట్టుతో ఎక్కడం నేరం. రెండు గంటలకి బొకారో వుంది. సరియైన టైముకి విజయ నగరం వస్తే చేరుస్తుంది. లగేజితో వున్నవాళ్ళు దాన్ని నమ్ముకోలేరు.

అదిగో అందుకూ ఈ కోవి బండి పాలబడ్డాడు గోవింద.

నిమిషాలు గడుస్తున్న కొద్దీ టెన్షన్ ఎక్కువైపోతూంది.

ముఖం నిండా ఎర్రదనం. ఈ కిటికీలో నుండి ఆ కిటికీలో నుండి చూపులు మాటి మాటికీ పరిగెత్తించడం. ఎడమ చేతితో ముడుకుల మీద కొట్టుకోవడం. కుడి చేతిలో వున్న న్యూస్ పేపరు పిడికిట్లో నలిగిపోవడం ఉస్స్ ఉస్సరన్న నిట్టూర్పులు.

ఈ మధ్య కొత్తవలసలో ఆగింది బండి.

టైము చూసుకున్నాడు పదిహేనోసారి. మూడూ ముప్పయ్యయిదు. ఓ అయిదు నిమిషాల్లో మళ్ళీ బయల్దేరినా నాలుగున్నరకి కాని ఈ లెక్కన విశాఖపట్నం చేరదు. అప్పటికి గోదావరి అనకాపల్లిలో వుంటుంది.

పోతే పోయింది అని వూరుకుని టికెట్ నరెండరు చేసినా పూర్తి డబ్బు తిరిగి రాదు, హైద్రాబాదులో తన పని ఆగిపోతుంది.

ఒక్క క్షణం రైల్వేల మీదా, రైల్వే అధికార్లమీదా బుస్సున కోపం పొంగింది. విజయనగరం లాంటి జంక్షన్ నుండి విశాఖపట్నం లాంటి మరో జంక్షన్‌కి వెళ్ళే సరియైన సదుపాయాలే లేవు. వీళ్ళకేదోలా బుద్ధి చెప్పాలి. చెప్తే వినే బుద్ధిమంతులెవరు? రైళ్ళ రాకపోకలూ, ప్రజల సదుపాయాలూ అన్నీ రాజకీయ స్వప్రయోజనాలమీద ఆధారపడి వున్నాయే?

ఆలోచిస్తూ కూర్చుంటే లాభం లేదు. ఎలాగోలా గోదావరి ఎక్స్‌ప్రెస్ అందుకోవాలి.

"కొత్తవలసలో ఎంతసేపాగుతుంది?" అనడిగేడు గోవింద పక్కనున్నవాడిని.

"ఓ అయిదు నిమిషాలాగుతుందేమో?"

దిగ్గున లేచి గబుక్కున బండి దిగేడు గోవింద.

** ** **

విశాఖపట్నం రైల్వే స్టేషన్ కోలాహలంగా వుంది.

ఒకటవ నెంబర్ ప్లాట్‌ఫాం మీద గోదావరి ఎక్స్‌ప్రెస్ గుండెల్లో గాభరాతో గుప్పు గుప్పుమంటోంది.

బండెక్కించడానికి వచ్చిన జనం కంగారు కంగారుగా పరిగెత్తుతున్నారు. బండెక్కిన జనం తొందరొక్కడిగా కిందికి దిగాలని ప్రయత్నం చేస్తున్నారు. కేకలు, హోరు, గాభరా, కంగారీ, దడ దడ, పోలీసులు, లాఠీలు, తణిఖీ.

ఏం జరిగింది?

ఏవిటయ్యిందండీ?

బాబ్బాబు గోదావరి, ఎప్పుడు బయల్దేరుతుందో చెప్పండి. పుణ్యముంటుంది.

'టైంబాంబండీ టైంబాంబు.'

అయిదు గంటలకే ధామ్మని పేలుతుంది.

ఎవడు చెప్పేడండీ ఎవడు?

ఆకాశరామన్న, ఎస్పీకి ఫోన్ చేసి మరీ చెప్పేడు.

ఆ...ఎన్ని విన్లేదు.

ఏమోబాబు మా అమ్మకి నేనొక్కణ్ణే...వస్తాను. ఆగాగు.

అదిగో పర్యాప్యాట్ టీ.వి.

"ప్రయాణీకులకు విజ్ఞప్తి. రైల్వే పోలీసు లింత వరకూ 'ఏ' నుండి 'ళ' కోచ్ వరకూ తణిఖీ పూర్తి చేసేరు. వారికి దయచేసి సహకరించండి. వదంతులను నమ్మకండి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగడానికి దోహదం చెయ్యకండి."

మళ్ళీ మైకుల్లో విజ్ఞప్తులు.

అయిదుంపావయింది.

"ప్రయాణీకులకు విజ్ఞప్తి. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఎటువంటి బాంబూ లేదని పోలీసు వర్గాలు, బాంబు నిపుణులూ సంయుక్తంగా ప్రకటిస్తున్నారు. కనుక విశాఖపట్నం నుండి హైద్రాబాదు పోవు గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటవ నెంబరు ప్లాట్‌ఫాం నుండి పది నిముషములలో బయలుదేరును. యువరెటెన్షన్ ప్లీజ్. నెంబర్ సెవెన్ విశాఖపట్నంటూ..."

"హమ్మయ్యా"

"రక్షించేరు."

"బ్రతుకు జీవుడా."

అప్పర్ బెర్త్ మీద అప్పటికే పక్క పరిచేసి నడుం వాల్చిన గోవింద చిన్నగా నవ్వుకున్నాడు.